
# కలెక్టర్‌కు 'చారుమతి అనాథ ఆశ్రమ' బాలికలు రాఖీ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అన్నా, చెల్లెలు, అక్క, తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా సంవత్సరానికి ఒక సారి జరుపుకునే గొప్ప పండుగ రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) అని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.సోదరికి తన సోదరుడు కలకాలం రక్షగా,తోడుగా ఉంటాననే నమ్మకాన్ని, భరోసాను రాఖీ పండుగ ద్వారా కల్పిస్తాడని,అదే నమ్మకంతో అక్కా,చెల్లెళ్లు తన సోదరులకు రక్షాబంధన్ కడతారని తెలిపారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రం పానగల్‌లో ఉన్న చారుమతి అనాథాశ్రమ బాలికలు జిల్లా కలెక్టర్‌ను కలెక్టరేట్‌లో కలిసి రాఖీలు కట్టారు.సోదరీ,సోదరుల ప్రేమానుబంధాలతో పాటు,వారికి రక్షగా నిలుస్తామనే భరోసాను కల్పించే రాఖీ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు.తనకు రాఖీలు కట్టిన బాలికలకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చారుమతి చైల్డ్ కేర్ సెంటర్ చిన్నారులు,మేనేజర్ శ్రీలత ఉన్నారు.


ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
ఆదివారం | 30 ఆగస్టు , 2026 | పేజీలు :5


# వివాద రహిత భూములన్నింటినీ సర్వే చేసి పట్టాలు ఇస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి : ప్రతి అంగుళాన్ని సర్వే చేసి భూ ఆసాములకు పట్టాలు

15 గ్రామాలలోని 1921 మంది రైతులకు 2091 ఎకరాలకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ

## బాధితులపై పోలీస్ జులుం

**ప్రజాపక్షం/కోదాడ:** ఫిర్యాదులు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన బాధితుల పట్ల పోలీసులు మర్యాదగా వ్యవహరించాలని, వారి బాధలను సావధానంగా విని సమస్యలు పరిష్కరించాలని, పోలీసుల పట్ల పౌరులు గౌరవంగా ఉండే విధంగా ప్రవర్తించాలని... మనది ఫ్రెండ్లీ పోలీసింగ్ అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ వ్యవస్థకు సూచనలు ఇచ్చింది. అయితే అందుకు భిన్నంగా గత 30 సంవత్సరాలుగా జీవనాధారంగా ఉన్న డబ్బాకొట్టును మున్సిపల్ అధికారులు తొలగించారని శాంతియుతంగా నిరసన చేస్తున్న బాధితులపై తన దాష్టీకాని చూపించారు. కోదాడ పట్టణ సిఐ శివశంకర్ పైగా మహిళలనే కనికరం లేకుండా విచక్షణ రహితంగా చేతులతో విదిల్చి కాళ్లతో తన్ని తన ఖాకీ జులుమును ప్రదర్శించారు. ఈ వైనం అంతా సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ అవుతుంది. కోదాడ పట్టణంలోని యాదవ్‌నగర్‌లో బిఆర్‌ఎస్ పార్టీ వార్డు ఇన్‌ఛార్జి మాదాల ఉపేందర్ అక్క గంధం కనకమ్మ గత 30 సంవత్సరాల క్రితమే డబ్బాకొట్టు ఏర్పాటు చేసుకుని తన ఇద్దరు ఆడపిల్లలతో జీవనం కొనసాగిస్తుంది. భర్తలేని ఆమె రోజు వచ్చే డబ్బులతో బతికీడుస్తుంది. అయితే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి దంపతులకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెడుతున్నాడని స్థానిక కాంగ్రెస్ నాయకుడు గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బాధితులపై విచక్షణారహితంగా దాడి చేసిన పట్టణ సిఐని తక్షణమే విధుల నుంచి తొలగించాలి, మహిళలనే విచక్షణ లేకుండా ప్రవర్తించడం దుర్మార్గం.



# క్రైమ్ పారామీటర్ల అమలులో నల్లగొండ పోలీసుల సత్తా

8 కీలక అంశాల్లో ఉత్తమ పనితీరు..
క్లస్టర్-3లో జిల్లాకు అగ్రస్థానం

ఎస్‌పి శరత్ చంద్ర పవార్‌కు ప్రశంసాపత్రం అందజేసిన డిజిపి సీవీ ఆనంద్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** క్రైమ్ పారామీటర్ల అమలు, పోలీస్ శాఖ పనితీరులో నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాష్ట్రస్థాయిలో వివిధ పోలీస్ యూనిట్ల పనితీరుపై నిర్వహించిన సమీక్షలో 8 కీలక అంశాల్లో సమగ్ర పనితీరు ఆధారంగా నల్లగొండ జిల్లా క్లస్టర్3లో అగ్రస్థానాన్ని సాధించింది.క్రైమ్ నియంత్రణ, కేసుల దర్యాప్తు, పోలీస్ విధుల అమలు తదితర కీలక అంశాల్లో జిల్లా పోలీస్ శాఖ కనబరిచిన పనితీరును అధికారులు సమీక్షించి ఈ ఫలితాలను ప్రకటించారు.అన్ని విభాగాల్లో సమన్వయంతో పనిచేస్తూ మెరుగైన ఫలితాలు సాధించడంపై జిల్లా పోలీస్ శాఖకు ప్రశంసలు లభించాయి.ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ కు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఐపీఎస్ ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు.భవిష్యత్తులోనూ పోలీసింగ్‌లో మరింత సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, అన్ని రంగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా అధికారులు,సిబ్బంది కృషి చేయాలని సూచించారు.క్లస్టర్3లో నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ అగ్రస్థానంలో నిలవడంపై ఎస్‌పి శరత్ చంద్ర పవార్ హర్షం వ్యక్తం చేశారు.ఈ విజయానికి కృషి చేసిన జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది, వివిధ విభాగాల బృందాలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.సమష్టి కృషి, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసిన ప్రతి ఒక్కరి కృషి ఫలితంగానే ఈ గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో మరింత మెరుగైన పోలీస్ సేవలు అందిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు.

# కోదాడలో సాగుతోంది ప్రజాస్వామ్యమా? ఆటవిక రాజ్యామా?



**మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్**

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ నియోజకవర్గంలో చట్టబద్ధమైన పాలనకు విరుద్ధంగా పోలీస్ వ్యవస్థను అడ్డం పెట్టుకుని రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆరోపించారు. పట్టణంలో ప్రజాస్వామ్య పాలన కొనసాగుతోందా? లేక ఆటవిక రాజ్యామా అని ఆయన ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లా బిఆర్‌ఎస్ అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్‌తో కలిసి బాధితురాలు గంధం కనకమ్మ కుటుంబాన్ని పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. వాట్సప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ మెసెజ్‌లు పెట్టారనే కారణంతో హైద్రాబాద్‌లో ఉన్న ఉపేందర్‌ను కోదాడ పోలీసులు బలగాలతో వెళ్లి తీసుకొచ్చి అర్ధరాత్రి వరకు విచారణ పేరుతో మానసికంగా వేధించారని ఆరోపించారు. న్యాయవాదులు, బిఆర్‌ఎస్ పట్టణ కమిటి జోక్యం చేసుకునే వరకు అక్రమంగా నిర్బంధించారని విమర్శించారు. ఉపేందర్‌కు సోదరి అనే కారణంతో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ, కోదాడ బొడ్రాయి సెంటర్‌లో గత 30 ఏళ్లుగా పాన్ డబ్బా నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న ఒంటరి మహిళ గంధం కనకమ్మ డబ్బాను తెల్లవారుజామున అకస్మాత్తుగా తొలగించడం దారుణమని మల్లయ్యయాదవ్ పేర్కొన్నారు. రాఖీ పండుగ సందర్భంగా న్యాయం కోసం నిరసన తెలిపిన మహిళలు, కుటుంబ సభ్యులపై పోలీసులు దాష్టికంగా వ్యవహరించారని ఆరోపించారు. టౌన్ ఇన్స్‌పెక్టర్ శివశంకర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత పట్టణంలో గంజాయి దందాలు, అక్రమాలు పెరిగిపోయాయని ఆయన అన్నారు. పట్టుబడిన గంజాయి విషయంలోనూ బర్రెల దొంగతనాల వ్యవహారంలోనూ ఆరోపణలు వచ్చినప్పటికీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పోలీసుల పక్షపాత వైఖరి, అక్రమ కేసులకు నిరసనగా సెప్టెంబర్ 2న సహచార ప్రజాస్వామిక పక్షాలను కలుపుకుని కోదాడ పోలీస్‌స్టేషన్ ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. చట్టపరమైన న్యాయపోరాటంతో పాటు ప్రజాక్షేత్రంలోనూ బాధితుల తరుపున పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



## మండల స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలు

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడలో సెప్టెంబర్ 1నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్14, అండర్17 బాల, బాలికల క్రీడా పోటీలు కోదాడలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి సలీంషరీఫ్ తెలిపారు. శనివారం కోదాడలోని స్కూల్ గేమ్స్ సంబంధించిన వివరాలను విలేకరులకు తెలిపారు. సెప్టెంబర్ 1న పట్టణ, గ్రామీణ ప్రాంతాల బాలికలకు, 2న బాలురకు పోటీలు నిర్వహించనున్నారు. అండర్14 విభాగానికి 2013 జనవరి 1తర్వాత, అండర్17 విభాగానికి 2020 జనవరి 1 తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఫోన్ నెంబర్‌తో కూడిన బోనఫైడ్ ధృవపత్రంతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు మండల ఎస్‌జిఎఫ్ కార్యదర్శి ఆర్.శ్రీనివాసరావును 90103 54245 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వరిపంటలో మొక్కలు చనిపోతున్నాయని ఫిర్యాదు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** వరిపంటలో మొక్కలు చనిపోతున్నాయంటూ రైతు చేసిన ఫిర్యాదుపై మండల వ్యవసాయ అధికారి జావిద్ స్పందించారు. మండల పరిధిలోని పెంచికల్‌దిన్నె గ్రామానికి చెందిన వలంశెట్ల కృష్ణయ్య తన వరి పొలంలో వెదజల్లిన 15నుంచి 20 రోజుల తర్వాత మొక్కలు చనిపోతున్నాయని ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం మండల వ్యవసాయ అధికారి జావిద్ రైతు పొలాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాథమిక వివరాలతో కూడిన నివేదికను జిల్లా వ్యవసాయ అధికారికి సమర్పించారు. రైతు విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణదారుడు, సంబంధిత డిస్ట్రిబ్యూటర్, విత్తన కంపెనీ ప్రతినిధులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించిన మగ్ర నివేదికను సమర్పించాలని, మొక్కలు చనిపోవడానికి గల కారణాలను స్పష్టంగా తెలియజేయాలని అదేశించారు.

## త్వరలోనే పనులు ప్రారంభిస్తా

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని వాయిలసింగారం ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాఠశాలలో అందించే మధ్యాహ్న భోజనను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐదు లక్షల రూపాయలతో పాఠశాల ప్రహరిగొడ నిర్మాణం కోసం కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సహకారంతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అన్నారు.



# కనుమరుగవుతున్న జానపద కళలు



**ప్రజాపక్షం/చింతలపాలెం :** గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా వస్తున్న భజన వంటి సంప్రదాయ జానపద కళలు క్రమంగా కనుమరుగవుతున్నాయని భజన మాస్టర్ గోపిరెడ్డి జగన్మోహన్ రెడ్డి అన్నారు. జానపద కళారంగంలో విశేష సేవలందిస్తున్న చింతలపాలెం మండలం గుడిమల్కాపురం గ్రామానికి చెందిన భజన మాస్టర్ గోపిరెడ్డి జగన్మోహన్ రెడ్డికి జిల్లాస్థాయి అవార్డు లభించింది. ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని సూర్యాపేట పబ్లిక్ క్లబ్‌లో తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించి అవార్డు, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ జానపద కళలను కాపాడేందుకు ప్రభుత్వం, సమాజం మరింత కృషి చేయాలని కోరారు. కళాకారులకు ఐడి కార్డులు, ఉచిత బస్‌పాస్‌లు, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు, హెల్త్ కార్డులు వంటి సంక్షేమ పథకాలను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాకారుల సంఘం అధ్యక్షుడు నెమ్మాజు గురుబ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శి యర్రబ్రోలు సోమిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు పొల్ల రాజ్యలక్ష్మి , కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దోర్నల గోవింద రెడ్డి, అడ్వకేట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సన్న బియ్యంలో దళారీల కల్తీ దందాను నివారించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికీ నాణ్యమైన సన్న బియ్యం అందించాలనే ఉద్దేశంతో ప్రారంభించిన రేషన్ సన్న బియ్యం పథకంలో దళారీల ప్రమేయంతో భారీగా కల్తీ జరుగుతోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు ఆరోపించారు. శనివారం మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయంలో సీపీఐ ఆధ్వర్యంలో అధికారులకు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లుల నుంచి ఎఫ్‌సిఐ, సివిల్ సప్లై గోడౌన్లకు బియ్యం సరఫరా అయ్యే క్రమంలో క్వాలిటీ ఇన్స్పెక్టర్లు క్షుణ్ణంగా తనిఖీ చేసి పాస్ చేయాల్సి ఉంటుందన్నారు. అయితే కొందరు అధికారులు స్వార్థ ప్రయోజనాల కోసం నాసిరకం బియ్యాన్ని సరకుగా దిగుమతి చేసుకుంటున్నారని విమర్శించారు. అనంతరం కాంట్రాక్టర్ల లారీల ద్వారా ఈ బియ్యం రేషన్ షాపులకు చేరుతోందని తెలిపారు. ఇటీవల యాదగిరిపల్లి గ్రామంలోని రేషన్ దుకాణాన్ని పరిశీలించగా దాదాపు 20 బస్తాల్లో దుమ్ము, ధూళి, పురుగులతో కూడిన బియ్యం ఉన్నట్లు స్పష్టమైందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రేషన్ దుకాణాలకు పంపించే బియ్యాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించి నాణ్యమైన సరుకు మాత్రమే అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి అంజన్నపల్లి రామలింగం, మట్టయ్య, ఎస్కే షమీం, ఎస్కే రహీం, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# హుజూర్‌నగర్‌లో గంగమ్మజాతర

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద రెండవ బోనాల జాతరగా పేరు గాంచబడి, ప్రతి సంవత్సరం హుజూర్‌నగర్లో అత్యంత వైభవంగా జరిగే పోచమ్మతల్లి, ముత్యాలమ్మ తల్లి, కనక దుర్గమ్మ తల్లి జాతరకు వారం రోజుల ముందుగా యాదవులతచే అత్యంత వైభవంగా నిర్వహించే పెద్దమ్మతల్లి జాతర నేడు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు యాదవ సోదరులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తరతరాలుగా వస్తున్న ఆచారంలో భాగంగా పెద్దమ్మ తల్లి పట్టణంలోని పెద్ద గొల్ల కుటుంబానికి చెందిన వారు తొలి పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటారు. యాదవులు పిలిస్తే పలికే దైవంగా తమ కుల దైవమైన గంగమ్మ తల్లిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి, బోనం చెల్లించి, కోడిపుంజులు, మేక, గొర్రెపోతులను ఆలయ ప్రాంగణంలో పోతురాజు ముందు బలి ఇచ్చి మొక్కులు చెల్లిస్తారు. అలాగే యాదవ సోదరులు, సోదరీమణులతో పాటు హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన వారు పెద్ద ఎత్తున గంగమ్మ తల్లిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## బాక్సింగ్ పోటీల్లో సెయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థినికి రజత పతకం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ అంతర్ పాఠశాల క్రీడా పోటీలు 2026లో భాగంగా హైదరాబాద్ సారూర్‌నగర్ స్టేడియంలో ఈ నెల 25న నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో మిర్యాలగూడకు చెందిన సెయింట్ జాన్స్ హై స్కూల్ విద్యార్థిని ఎన్.దూహిత రజత పతకం సాధించింది.పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న దూహిత అండర్10 విభాగంలో అద్భుతమైన ప్రతిభను కనబరిచి రజత పతకంతో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకుంది. ఈ సందర్భంగా విద్యార్థిని దూహితను సెయింట్ జాన్స్ హై స్కూల్ ప్రిన్సిపాల్ అలుగుబెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కరెస్పాండెంట్ అలుగుబెల్లి శిరీష హృదయపూర్వకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## పరామర్శ

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని దూపహాడ్ గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడిన మాజీ జడ్‌పిటిసి పిన్నాని కోటేశ్వరరావు కుమారుడిని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని అందుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నున్నపంగ కమలమ్మ సైదులు, ఉపసర్పంచ్ ఆర్తి నరేష్, నాయకులు బిట్టు వీరయ్య, పబ్బటి కోటేశ్వరరావు, జనార్ధన్, షేక్ అబ్దుల్ కరీం, పిన్నాని సందీప్ పాల్గొన్నారు.

## రైస్ మిల్లుల్లో పిసిబి తనిఖీలు - కాలుష్య తీవ్రతపై గ్రామస్థుల ఆందోళన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యాద్గార్‌పల్లి పరిధిలోని రైస్ మిల్లుల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై ఫిర్యాదులు రావడంతో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) బృందాలు రెండు రోజులుగా అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించాయి. ఎటువంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా నాలుగు వాహనాల్లో వచ్చిన అధికారులు మిల్లుల్లో ప్రత్యేక యంత్రాలను అమర్చి కాలుష్య స్థాయిలను రికార్డు చేశారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తనిఖీల ఆధారంగా పూర్తి స్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. అయితే ధాన్యం సీజన్‌లో విపరీతమైన పొగ, బొగ్గు ధూళి రావడం వల్ల పంట పొలాలు నాశనమవడమే కాకుండా ఇళ్లలోనూ కాలుష్యం పేరుకుపోతోందని, అన్‌సీజన్ సమయంలో వచ్చి తనిఖీలు చేయడం వల్ల అసలు సమస్య బయటపడదని స్థానిక గ్రామస్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారుల రాకను గమనించిన పలువురు రైస్ మిల్లర్లు తమ మిల్లులను మూసివేయడం ఇక్కడ చర్చనీయాంశంగా మారింది.

## ఇల్లు ప్రతి పేద కుటుంబం సొంత కల



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ఇల్లు ప్రతి పేద కుటుంబం సొంత కల అని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రామ్లతండ గ్రామంలో గ్రామ సర్పంచ్ వాంకుడోతు హాథిరామ్, ఉప సర్పంచ్ జాటోత్ శాంతిలతో కలిసి వాంకుడోతు సరితా మోతిరాం ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

## బుల్లెట్ ట్రైన్ ఉద్యమానికి అన్ని విధాలుగా సహకారం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** బుల్లెట్ ట్రైన్ ఉద్యమానికి అన్ని విధాలుగా సహకారిస్తామని సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదే శ్రీనివాసులు అన్నారు. బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలలో భాగంగా శనివారం 16వ రోజు పిఓడబ్లు జిల్లా కమిటి దీక్షలో పాల్గొనగా వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. సూర్యాపేటకు మొదట చేసిన అలైన్మెంట్ ప్రకారం బుల్లెట్ రైలు రావాల్సి ఉండగా ప్రాముఖ్యతను లేని కొండమల్లేపల్లి, హాలియా, సాగర్ మీదుగా మార్చడం జరిగిందన్నారు. మొదట ప్రకటించిన విధంగా బుల్లెట్ ట్రైన్‌ను హైదరాబాద్ సూర్యాపేట అమరావతి మీదుగా చెన్నైకి నడపాలని డిమాండ్ చేశారు. నరసమ్మ, గునగంటి నీలమ్మ, అలుగుబెల్లి వాణిశ్రీ, సామ ఉపేంద్ర, వెంకటమ్మ, ఎల్లమ్మ, సుప్రియ, జయసుధలు పాల్గొనగా, దీక్షకు మాజీ కౌన్సిలర్ అనంతుల మల్లేశ్వరి, గుండా శ్రీధర్, సోమ వెంకటేశ్వర్లు బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటి నాయకులు సంఘీభావం తెలిపారు.

## ఆచార్య గిడుగు ఆశయ సాధనకు కృషి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు ఆచార్య గిడుగు రామ్మూర్తి పంతులు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జప్తి వీరప్పగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలిశెట్టి బిక్షపతి పిలుపునిచ్చారు. శనివారం పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు గుడిపాటి కోటయ్య, ఒట్టే మాధవి, తుమ్మలూరి శ్రీనివాస్ రెడ్డి, రేణుక, విద్యార్థులు పాల్గొన్నారు.





## పొదల్లో గుర్తు తెలియని మృతదేహం

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని చింతచెట్టుతండా గ్రామ పంచాయతీ పరిధి శివారులో కంకర మిల్లు పక్కన పొదల్లో పాక్షికంగా కాలిన మృత దేహం శనివారం కంకర మిల్లు సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుని యొక్క వయస్సు 45 నుండి 50 సంవత్సరాల మధ్య ఉండి కాళ్ళకు నలుపు రంగు చెప్పులు ధరించి మృత దేహంపై డబ్బాల గీతల చొక్కా, ఎరుపు రంగు తువాల ఉన్నట్లు తెలిపారు. మృత దేహం పక్కన కవర్లో ఒక దుప్పటి ఉన్నట్లు గుర్తించారు. సుమారు ఆరు రోజుల క్రితం ఆ వ్యక్తి చనిపోయి ఉండవచ్చని అన్నారు. చింతచెట్టుతండా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 8712670226, 8712670157 ఫోన్ నంబర్లకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

## యూత్ కాంగ్రెస్‌కు మల్లేష్ సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** యూత్ కాంగ్రెస్ నాయకులు దూబని మల్లేష్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరణీయమని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మండలంలోని మాచారం గ్రామంలో మల్లేష్ దశదిన కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి మాట్లాడారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇటికల శ్రీను, ఉపసర్పంచ్ అనిరెడ్డి సందీప్ రెడ్డి, బొల్లక సైదులు, అనిరెడ్డి వెంకట్ రెడ్డి, భూక్య నాగు, షేక్ అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

## గ్రామసభ

**ప్రజాపక్షం/అనంతగిరి:** వికాసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలో భాగంగా శనివారం మండల పరిధిలోని వాయిలసింగారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు మాట్లాడుతూ విబిజిరామ్‌జీ 2026/27 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులపై సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఊరిలో ఊటకుంట, ప్రతిచేనులో నీటికుంట, ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత నినాదంతో భూగర్భజలాలను పెంచుతూ గ్రామాభివృద్ధికి పనులు చేపట్టేఉద్దేశ్యమని అన్నారు. పంచాయతీ కార్యదర్శి కాకర్ల సౌమ్య, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి



**ప్రజాపక్షం/త్రిపురారం:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి అన్నారు. శనివారం త్రిపురారం మండలంలోని కంపసాగర్ దుబ్బ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థిని చింతకుంట్ల శిరీష 600 మార్కులకు గాను 588 మార్కులు సాధించినందుకు ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి ఆమెను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అల్లంపల్లి జానయ్య, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ముడిమల్ల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ అనుముల పాండమ్మ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో విజయకుమారి, ఎంఈఓ రవినాయక్ పాల్గొన్నారు.


మండల కేంద్రంలోని బాబు సాయిపేట నుంచి వెంకటసాయి రైస్‌మిల్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన హైవే లైట్లు సక్రమంగా వెలగకపోవడంతో వాహనదారులు, గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని నల్లగొండ జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు మేదర్ సైదులు ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.హైవే లైట్లు ప్రతి రోజూ వెలిగేలా చర్యలు తీసుకోవాలని, అలాగే మిషన్ భగీరథ నీరు ప్రతి గ్రామంలో ప్రజలకు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# యువజన కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ విశ్రాంతభవనంలో నకిరేకల్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యువజన కాంగ్రెస్ నకిరేకల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏనుగు రఘుమా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రామన్నపేట యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టె సంతోష్ కుమార్ మాట్లాడుతూ రామన్నపేట మండలంలో నూతనంగా నియమింపబడ్డ గ్రామశాఖ అధ్యక్షులను, కార్యవర్గ సభ్యులను అభినందించారు.నూతనంగా నియమింపబడ్డ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుగుడు రవి యాదవ్,నకిరేకల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పున్న అమరేందర్,నార్కెట్పల్లి యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జిల్లా పృథ్వీ, రామన్నపేట మండల ఉపాధ్యక్షులు కందగట్ల రాహుల్, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు మేకల జలేందర్, కేస సందీప్ పాల్గొన్నారు.

# శివన్నగూడెంలో దొంగల హల్చల్



**ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ.. క్లూస్ టీం ఆధారాల సేకరణ**

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలంలోని శివన్నగూడెం గ్రామంలో చోరీ ఘటన కలకలం రేపింది. గ్రామానికి చెందిన గంజి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి నెల రోజుల పాటు సింగపూర్‌కు వెళ్లడంతో ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గుర్తించిన గుర్తుతెలియని వ్యక్తులు అదునుగా చేసుకుని ఇంట్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్ కుటుంబ సభ్యులు కొంతకాలంగా ఇంటికి దూరంగా ఉండటాన్ని గమనించిన దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించినట్లు తెలుస్తోంది. ఇంట్లోని వస్తువులను పరిశీలించి చోరీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే చోరీకి గురైన నగదు, బంగారం, ఇతర వస్తువుల పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.చోరీ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీంను రప్పించి ఇంట్లో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. చోరీ జరిగిన తీరును పరిశీలించిన పోలీసులు నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని ముందుగానే గమనించి దుండగులు చోరీకి పాల్పడ్డారా? లేక ఈ ఘటన వెనుక మరేదైనా కారణం ఉందా అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపడుతున్నారు. సమీప ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను సైతం పరిశీలించే అవకాశం ఉంది.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని పోలీసులు వెల్లడించారు.

## అనుమానాస్పద ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలన



**ప్రజాపక్షం/నాంపల్లి:** నాంపల్లి మండల కేంద్రంలోని గ్రామ సభలో అనుమానాస్పద (ఏనామలీస్) ఓటర్ల జాబితాను తహసీల్దార్ అంబటి ఆంజనేయులు శనివారం క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నాంపల్లి గ్రామంలోని పీఎస్ నంబర్ 324 పరిధిలో గుర్తించిన అనుమానాస్పద ఓటర్ల వివరాలను అధికారులు పరిశీలించారు.ఈ సందర్భంగా ఓటర్ల పేర్లు, చిరునామాలు, ఇతర వివరాలను సంబంధిత రికార్డులతో సరిపోల్చి, నమోదైన వివరాల వాస్తవ పరిస్థితులను అధికారులు తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా, అనర్హుల పేర్లు, పునరావృతంగా నమోదైన పేర్లు, ఇతర అసాధారణ నమోదులను గుర్తించి నిబంధనల ప్రకారం సరిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు గోపిరాజు, నర్సింహా,బీఎల్ఓలు, జీపీఓ అంతయ్య, తదితరులు పాల్గొన్నారు.



## నేటి బాలలే భవిష్యత్తు దేశ సంపద

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** మండల పరిధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోటమర్తి యందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం మండల న్యాయ సేవ అధికార సంస్థ(ఎంఎల్ఎస్‌సి) రామన్నపేట ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ దంతూరి సత్తయ్య మాట్లాడుతూ నేటి బాలలే భవిష్యత్తు దేశ సంపదని బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ, బాలల హక్కుల పరిరక్షణ మన అందరి బాధ్యత అని అన్నారు. 1098,100, 108, 112, తదితర టోల్ ఫ్రీ నెంబర్ల గురించి అవగాహన కల్పించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంచర్ల రాజ్య వర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి అగ్రి లీగలైడ్ క్లినిక్ కే.శ్రీశైలం, లీగల్ సర్వీస్ ప్రతినిధి కురిమేటి యాదయ్య, పాఠశాల చైల్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి విజయలక్ష్మి , స్థానిక సర్పంచ్ పాశం విష్ణువర్ధన్ రావు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సరైన మార్గాల్లో వియోగిస్తే పరిష్కారం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రస్తుత పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడానికి, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత సరైన పరిష్కారమని ఆశ్రిత ఇన్స్టిట్యూట్ ఫర్ వేస్ట్ మేనేజ్మెంట్ అండ్ రీసెర్చ్ ఆశ్రిత బయో ఫౌండేషన్ సంస్థల వ్యవస్థాపకులు, డైరెక్టర్ సుశాంత్ గాదే అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా, భూదాన్ పోచంపల్లి మండలం, దేశ్ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో శనివారం 'స్కూల్ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అండ్ హ్యూమానిటీస్' కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఎన్విరాన్మెంటల్ మానిటరింగ్ & వేస్ట్ మేనేజ్మెంట్' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యసించారు.కార్యక్రమంలో మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణ మరియు పర్యావరణ సమతుల్యతలో వాస్తవిక అనువర్తనాలు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు.ఈ ప్రత్యేక సెషన్లలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది , విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియ, గ్రామసభలో డ్రగ్స్‌పై అవగాహన

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని దత్తాయిపల్లి గ్రామంలో శనివారం సర్ సవరణ ప్రక్రియపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్ ఓటర్లకు ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, ఓటు సవరణలో సమస్యలు ఉన్న వారికి బిఎల్ ఓ ల ద్వారా నోటీసులు అందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, ముఖ్యంగా యువత డ్రగ్స్ దూరంగా ఉండాలని సూచించారు. సెప్టెంబర్ 6, ఆదివారం బోనాల పండుగను గ్రామంలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిట్ట కిషన్,వార్డు సభ్యులు,బూత్ స్థాయి అధికారులు, గ్రామస్థాయి ఉద్యోగులు,నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.





## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/చండూరు** : మండలంలోని గుండ్రపల్లి గ్రామంలో బిఆర్ఎస్ కార్యకర్త కురుపాటి శ్రీను మాతృమూర్తి కురుపాటి ఎమ్మెల్యే ఇటీవల అనారోగ్యంతో మరణించారు వారి కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ ఉజ్జిని ఉషా అనిల్ రావు,బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మరబోయిన వెంకన్న తో కలిసి పరామర్శించి కురుపాటి బిక్షమయ్య కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వినోద్ రెడ్డి, వార్డు మెంబర్లు తీగల వెంకన్న,వడ్డమల్ల మధు,పెండ్యాల ఉపేందర్,దామెర అనిల్,కురుపాటి రాజు,కురుపాటి సాయిలు, కురుపాటి కృష్ణ, నక్క కృష్ణయ్య, క్రాంతి, నవీన్‌పాల్గొన్నారు.

## ప్రజల కోసమే.. ప్రజావాణి

**ప్రజాపక్షం/నకిరేకల్:** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జిల్లా అధికారుల సూచనలు మేరకు ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు నకిరేకల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి గన్నోజు బ్రహ్మాచారి తెలిపారు. నకిరేకల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరుకానున్నందున వివిధ సమస్యలపై ప్రజలు నేరుగా వినతులు అందజేసి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## మూడు రోజులు.. ముత్యాలమ్మ తల్లి ఉత్సవాలు

**ప్రజాపక్షం/నకిరేకల్** :చెర్వు అన్నారం గ్రామంలో ముత్యాలమ్మ,మారెమ్మ తల్లి బోనాల పండుగను మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. గ్రామ ప్రజలు, దాతల సహకారంతో నూతన ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో ఈసారి ఉత్సవాలు ప్రత్యేకంగా జరగనున్నాయి. భక్తులు, ఆడపడుచులు, బంధువుల రాకతో గ్రామం పండుగ శోభను సంతరించుకోనుంది.సెప్టెంబరు 1న విగ్రహ ప్రతిష్ఠాపన, అమ్మవారికి విశేష జలాభిషేకం నిర్వహిస్తారు.2న దివ్య కల్యాణ మహోత్సవం జరపనున్నారు.3న ఉదయం 6 గంటలకు నైవేద్యాలు సమర్పించి బోనాలు నిర్వహిస్తారు.సాయంత్రం 3 గంటలకు బండ్ల ఊరేగింపు వైభవంగా చేపట్టనున్నారు.గ్రామ ప్రజలు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

## సైన్స్ డ్రామాలో.. చందంపల్లి విద్యార్థులు

**ప్రజాపక్షం/నకిరేకల్:** జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీల్లో నకిరేకల్ మండలంలోని చందంపల్లి ఎంపీయూపీఎస్ విద్యార్థుల బృందం పాల్గొంది. విజ్ఞాన అంశాలను నాటక రూపంలో ప్రదర్శించి విద్యార్థులు ఆకట్టుకున్నారు. పోటీలకు బయలుదేరే ముందు గ్రామ సర్పంచ్ మాచర్ల చంద్రకళ యాదగిరి జెండా ఊపి బృందాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి పోటీల్లో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఏపీసీ ఛైర్‌పర్సన్ సృజన, ప్రధానోపాధ్యాయులు కె.నవీన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు .




## జగిని సక్కుబాయి మృతికి గుత్తా సుఖేందర్‌రెడ్డి సంతాపం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పట్టణానికి చెందిన ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త జగిని వెంకన్న తల్లి జగిని సక్కుబాయి(83)మృతి పట్ల తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.ఆమె కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తూ,ఈ విషాద సమయంలో వారు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు.ఆమె మరణానంతరం కుటుంబ సభ్యులు తీసుకున్న మానవతా నిర్ణయం పలువురి ప్రశంసలు అందుకుంది.కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను దానం చేశారు.ఈ నేత్రదానం ద్వారా కార్నియా అంధత్వంతో బాధపడుతున్న ఇద్దరికి చూపు కల్పించే అవకాశం లభించింది.లయన్స్ క్లబ్ ఆఫ్ నల్లగొండ చారిటబుల్ ట్రస్ట్ ఐ డొనేషన్ సెంటర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నేత్రదానం 449వ నేత్రదానంగా నమోదైనట్లు నిర్వాహకులు తెలిపారు.మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్యాలపై బిఆర్ఎస్ పోరుబాట



**ప్రజాపక్షం/దేవరకొండ;** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలు, పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు బిఆర్ఎస్ పార్టీ చేపట్టనున్న వారం రోజుల పోరుబాటను విజయవంతం చేయాలని దేవరకొండ మాజీ ఎంఎల్ఏ, బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ ఇంచార్జీ రమావత్ రవీంద్రకుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ, వెయ్యి రోజులు గడిచినా అమలు కాని హామీలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలు, అవినీతి ఆరోపణలను ప్రజల ముందుంచి ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బిల్యానాయక్, పిఏసిఎస్ ఛైర్మన్ ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసరావు, టివిఎన్‌రెడ్డి, వల్లపురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, దస్రునాయక్, సుభాష్, గోపాల్, సర్వయ్య, ముత్యపురావు, లోక్య, అంజి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో ఎంజీయూ విద్యార్థులు రాణించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** శ్రమ నామాంతరమే..బుద్ధి శ్రమ రూపాంతరమే వృద్ధి.. శ్రమిస్తే సకలం సాధ్యమేనంటూ నారిమల్ల ప్రవళిక సాధించిన బంగారు పతకం దేశానికి గర్వకారణమని ఎంజీయూ రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి పేర్కొన్నారు.క్రీడా దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఎంజీయూలో ఏర్పాటు చేసిన క్రీడా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రమిస్తే పేదరికాన్ని, వెనుకబాటుతనాన్ని సైతం జయించి విజయాలను సాధించవచ్చని అన్నారు.ఎంజీయూలో ఉన్న అన్ని క్రీడా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని పిలుపునిచ్చారు.పేదరికం నుంచి దేశ పతాకాన్ని రెపరెపలాడించిన నారిమల్ల ప్రవళిక ఎంజీయూ విద్యార్థిని కావడం ఆనందదాయకం, స్ఫూర్తిదాయకం అన్నారు.అనంతరం క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు,అధ్యాపకులకు బహుమతులు ప్రదానం చేశారు. నారిమల్ల ప్రవళిక,ఆమె తల్లి నారిమల్ల విజయను సన్మానించారు.ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ మద్దిలేటి, డిండి కళాశాల కోచ్ పరశురామ్,ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ మారం వెంకటరమణారెడ్డి, ఆచార్య సరిత, ఆచార్య శ్రీలక్ష్మి, డా. లక్ష్మీ ప్రభ తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధ్యానంతోనే ఒత్తిడికి చెక్ - ఆరోగ్యకరమైన సమాజం సాధ్యం-



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అనునిత్యం పని ఒత్తిడి, శారీరక ఆందోళనలతో గడిపే మానవ జీవితానికి ధ్యానమే సరైన సంజీవని అని, దాని ద్వారానే మానసిక ప్రశాంతత మరియు ఆరోగ్యకరమైన జీవనశైలి సాధ్యమవుతాయని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. స్థానిక జ్యోతిరావు పూలే భవనంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీ రామచంద్ర మిషన్ సంయుక్త నిర్వహణలో గత మూడు రోజులుగా ఉచితంగా నిర్వహించిన ధ్యాన శిక్షణ శిబిరం శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరిలో ఏకాగ్రత, మానసిక స్థిరత్వం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిత్య జీవితంలో ధ్యానాన్ని ఒక భాగం చేసుకోవడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని సూచించారు. ప్రజల శ్రేయస్సు కోసం మూడు రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇచ్చి మార్గదర్శనం చేసిన హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీ రామచంద్ర మిషన్ ప్రతినిధులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో శాంతి, ఆధ్యాత్మికతను పెంపొందించే ఇటువంటి శిక్షణలను నియోజకవర్గంలో తరచూ నిర్వహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీ రామచంద్ర మిషన్ ప్రతినిధులు, ధ్యాన శిక్షకులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో శిక్షణ పొందిన సాధకులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



## హరికృష్ణ సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి, ప్రజలకు మాజీ మంత్రి, రాజ్యసభ మాజీ సభ్యులు నందమూరి హరికృష్ణ అందించిన సేవలు చిరస్మరణీయమని తెలుగుదేశం పార్టీ పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నందమూరి హరికృష్ణ వర్ధంతి వేడుకలను పట్టణ కన్వీనర్ వడ్డెబోయిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు నసీరొద్దీన్ బాబా, టిఎన్టియుసి నాయకులు ఉప్పలపాటి గోపాలకృష్ణ, పట్టణ నాయకులు శంకరావు, పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/చండూరు** :మున్సిపాలిటీ కేంద్రంలోని ఏడో వార్డులో మునుగోడు ఏమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చండూరు మున్సిపాలిటీకి కేటాయించిన 15 కోట్ల అభివృద్ధి నిధుల నుండి 7 వ వార్డు లో డ్రైనేజీ, సిసి రోడ్ల నిర్మాణ పనులను శనివారం చండూర్ మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడవ వార్డు కౌన్సిలర్ కోడి సుష్మా వెంకన్న మాట్లాడుతూ రాజగోపాల్ రెడ్డి సహకారంతో చండూరు మున్సిపాలిటీని రాష్ట్రంలోనే అత్యుత్తమ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని వార్డులో ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేరవేస్తూ వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బూతురాజు దశరథ, కౌన్సిలర్లు వాసు,జెల్లా ధనమ్మ శ్రీనివాసులు ,కో ఆప్షన్ మెంబర్లు ఖలీల్ ,షరీఫ్,మొగుదాల వెంకన్న,మాజీ సర్పంచ్ కోడి గిరిబాబు,పున్న సైదులు పాల్గొన్నారు.

## ఎఐవైఎఫ్ విస్తృత ప్రచారం




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : రాష్ట్ర 3వ మహాసభలను జయప్రదం చేయాలని యాదగిరిగుట్టలో విస్తృత ప్రచారం కొరకై యాదగిరిగుట్ట పట్టణంలో గోడ రాతలు (వాల్ రైటింగ్) పోస్టర్ లు కరపత్రాల ద్వారా ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 8 9 10 తేదీలలో యాదగిరిగుట్ట లో జరిగే రాష్ట్ర మహా సభలలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి 400 మంది ప్రతినిధులు హాజరై యువత ఎదుర్కొంటున్న సమస్యలపైన చర్చించి పోరాటాలు నిర్వహించడం కొరకు భవిష్యత్ కార్యాచరణ రూపొందించబడుతుందని తెలిపారు సెప్టెంబర్ 8న జరిగే యువజన ప్రదర్శన బహిరంగ సభకు యువత పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు కళ్లెం కృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొల్లూరి రాజయ్య, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ మాజీ కో ఆప్షన్ మెంబర్ పేరబోయిన పెంటయ్య, ఏఐవైఎఫ్ నాయకులు అనంతుల నరసింహ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత దంత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/చింతలపాలెం** : మండల కేంద్రంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో నేడు (ఆదివారం) శ్రీకళ్యాణి డెంటల్ క్లినిక్ కోదాడ వారి ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిభిరం నిర్వహించబడుతాయని సర్పంచ్ కందుల రామకోటి రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకొని దంత ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం





**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల కేంద్రంలోని రేవూరి రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐరా రియాల్టి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్ఐ నవీన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహనికి, హాకీ క్రీడల ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దామెర్ల అంజి, వి.నరేందర్, ఆలయ ఈవో నాగెల్ల శంభిరెడ్డి, కబడ్డీ అసోసియేషన్‌అధ్యక్షులు మోర్తాల నాగిరెడ్డి, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని ప్రధానోపాధ్యాయులు తాతరాజు శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత హాకీ దిగ్గజం మేజర్ ద్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, అస్మా, ముబిన్, కల్పగిరి, శ్రీనివాస్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సంస్థాన్ నారాయణపురం మండల కేద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద హాకీ మాంత్రికుడు, భారత దిగ్గజ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్



ధ్యాన్చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం గ్రామపంచాయతీ 4వ వార్డు మెంబర్ సూరపల్లి వెంకటేశం, కారోబార్ యాదగిరి, బీఎల్ఓ పార్వతి, వంశీ, సాయిదులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/హాలియా:** అనుముల మండలం హాలియా మున్సిపాలిటీలో ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో హాకీ పితామహుడు ధ్యాన్ చంద్ జయంతిని ఘనంగా నిర్వహించారు.శనివారం హాలియాలోని శ్రీ శ్లోక పాఠశాలలో ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కుకడాల ఆంజనేయులు,పీడీలు వెంకటరామిరెడ్డి,డోమినిక్,రాంబాబు,బుయ్య పరమేష్,చంద్రశేఖర్,అనిల్,కిరణ్ కుమార్, పర్వతాలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/దేవరకొండ;** జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ స్పోర్ట్స్ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకట్‌రెడ్డి, అధ్యక్షులు ఎన్‌విటి సభ్యులతో కలిసి క్రీడా జ్యోతి వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ విగ్రహానికి ఎస్ఐ రాజు, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, ఎన్‌విటి సభ్యులతో క లిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, భాస్కర్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్ ఉమామహేష్, కరుణాకర్, సురేష్, ప్రసన్న కుమార్, భాస్కర్, రాజ్‌కుమార్, రామకృష్ణ, సన్నీ, సాయి, అజయ్‌చంద్ర, అంజి పాల్గొన్నారు.



## సెప్టెంబరు 5న.. నకిరేకల్‌కు సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెప్టెంబరు 5న నకిరేకల్ నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. సీఎం పర్యటనలో భాగంగా నకిరేకల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించడంతోపాటు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.అనంతరం నకిరేకల్ మినీ స్టేడియంలో నియోజకవర్గస్థాయి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని మండలాల ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా కీలక అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం కానుండటంతో నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని వేముల వీరేశం పేర్కొన్నారు.

## నేరాల నియంత్రణకు సిసి కెమెరాలు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** సిసి కెమరాలతో అనేక ప్రయోజనాలు ఉంటాయని, ప్రతి గ్రామంలో సిసి కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని యాదగిరిగుట్ట రూరల్ సిఐ శంకర్ గౌడ్ అన్నారు. ఆయన శనివారం మోటకొండూర్ మండలంలోని ఆబిద్ నగర్ గ్రామ పంచాయతీ పరిదిలోని భద్రు బావిలో 05 సిసిటివి కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో దొంగల బెడద లేకుండా, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సిసి కెమరాలు ఉపయోగపడతాయని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ బి.కుమారస్వామి ఉప సర్పంచ్ సాయిరెడ్డి, కృష్ణారెడ్డి, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దగా పాలనపై పోరుకు సిద్ధం



**ప్రజాపక్షం/హాలియా:** కాంగ్రెస్ వెయ్యి రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించేందుకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. శనివారం హాలియాలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు కావస్తున్నందున వారు ఇచ్చిన హామీలను విస్మరించి దగా పాలన చేస్తున్నారని అన్నారు. దీనిపై సెప్టెంబర్ 2 నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాక కార్యదర్శి కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు కార్యకర్తలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలను దగా చేసిన విధానంపై అవగాహన కల్పించేలా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆప్కాబ్ చైర్మన్ ఎడవెల్లి విజేందర్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు కూరాకుల వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, కర్ణ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకాలతో స్నేహం చేద్దాం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పుస్తకాలతో స్నేహం చేస్తే అవి జీవితాలకు వెలుగునిస్తాయని గ్రంథాలయ ఉద్యమ సారధి కస్తూరి ప్రభాకర్ అన్నారు. శనివారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని సుందరయ్య పార్కులో చిన్నారుల కోసం పుస్తకాల ప్రదర్శనను ఏర్పాటు చేశారు. సాయంత్రం పార్కుకు వచ్చిన పిల్లలు పుస్తకాలను ఆసక్తిగా చదివారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో ఆంగ్ల మాధ్యమం పెరగడం వల్ల విద్యార్థులకు తెలుగు స్పష్టంగా నేర్చుకునే అవకాశం తగ్గడం విచారకరమన్నారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు, తల్లిదండ్రులు పిల్లలకు తెలుగు పుస్తకాలు చదివే అలవాటు చేయాలని కోరారు. పలువురు వాకర్స్, చిన్నారులు పాల్గొన్నారు.







## ప్రభుత్వ వైఫల్యాలపై బిఆర్ఎస్ పోరు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను, రైతు వ్యతిరేక వైఫల్యాలను నిలదీసేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఈ నెల సెప్టెంబర్ 3న మిర్యాలగూడకు రానున్నారని మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు, తిప్పన విజయసింహారెడ్డి వెల్లడించారు. శనివారం పట్టణంలోని రెడ్డి కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పర్యటనను చారిత్రాత్మక విజయవంతం చేసేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలు, యంత్రాంగం, యువజన విభాగాల ప్రతినిధులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అల్లుబెల్లి అమరేందర్‌రెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నల్లమోతు సిద్ధార్థ, దుర్గంపూడి నారాయణ రెడ్డి, ఎండి.యూసుఫ్, ధనావత్ చిట్టిబాబునాయక్ పాల్గొన్నారు.

## ఆరోగ్య మిత్రలకే టీం లీడర్ అవకాశం ఇవ్వాలి

**ప్రజాపక్షం/మర్రిగూడ:** 2007 నుండి ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ పరిధిలో ఆరోగ్య మిత్రలుగా పేద ప్రజలకు సేవలు అందిస్తున్న వారికే టీం లీడర్లుగా అవకాశం కల్పించాలని ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య డిమాండ్ చేశారు.తక్కువ వేతనంతో పని చేస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులకు తక్షణమే ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్ కల్పించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ కేంద్ర కార్యాలయంలో ట్రస్ట్ జనరల్ మేనేజర్ నరేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

# బతుకునిచ్చే భాష తెలుగే

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఆంగ్ల భాష జ్ఞానాన్ని ప్రసాదిస్తే తెలుగు భాష బతుకునిస్తుందని విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయులు, యోగా గురువు మాదగాని శంకరయ్య అన్నారు.శనివారం పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు 164వ జయంతి సందర్భంగా తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శంకరయ్య హాజరై మాట్లాడుతూ ఇప్పటి విద్యార్థులకు భాషణ నైపుణ్యం బావున్నా లేఖనంలో ప్రావీణ్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పరంగి రవికుమార్, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వెంల్డడి శ్రీధర్, అధ్యాపకులు దండి అంజయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.







**ప్రజాపక్షం/రామన్నపేట :** వ్యవహారిక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవమును నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్.రత్న మంజుల,ఐక్యుఏసి కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, పరిపాలనాధికారి జి.కరుణాకర్ తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/రామన్నపేట : గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని శ్రీ హిందూ డిగ్రీ కళాశాల రామన్నపేటలో తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది సహస్ర,వైస్ ప్రిన్సిపల్ శ్రీదేవి,సతీష్ కుమార్, శ్రీశైలం,లింగస్వామి,వెన్నెల కళ్యాణి, శ్వేత,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.





## సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ అమలు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులు మరియు ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం మిర్యాలగూడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరాజు మధుబాబు, అసోసియేట్ అధ్యక్షుడు తోట యోగేందర్, మహిళా కన్వీనర్ గీతారెడ్డి పాల్గొన్నారు.

